వరల్డ్ కోకో పోటీలకు ఎంపికైన శివనాయక్‌ను అభినందిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే ముఠా గోపాల్

క్రీడాకారులకు ప్రోత్సాహం

చిక్కడపల్లి, నవంబర్ 24: క్రీడాకారులకు తమ వంతు ప్రోత్సాహం అందిస్తామని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. బాగ్‌లింగపల్లి బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన డబుల్ బెడ్‌రూంలో నివాసం ఉండే ఆటో డ్రైవర్ దేవేందర్ నాయక్ కుమారుడు జరుపుల శివనాయక్ వరల్డ్ కోకో పోటీలకు ఎంపిక య్యాడు. ఆదివారం ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆధ్వర్యంలో శివనాయక్ కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రానికి చెందిన గిరిజన బిడ్డ శివ నాయక్ అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయం అన్నారు. శివనాయక్‌కు తమవంతు సహకారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన గ్రేటర్ అధ్యక్షుడు వడిత్య కల్యాణ్ నాయ్, నారాయణ నాయక్ పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల అమలుపై ఉద్యమాలకు సిద్ధం కావాలి

ఘట్‌కేసర్ రూరల్, నవంబర్ 24 : ఆరు గ్యారంటీల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వంపై ఉద్యమాలకు సిద్ధం కావాలని మేడ్చల్ జిల్లా సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యులు కోమటి రవి, ఎర్ర అశోక్‌లు పిలుపునిచ్చారు. ఘట్‌కేసర్ పట్టణంలోని సీతారాం ఏచూరి నగర్‌లో ఆదివారం మండల సీపీఎం 6వ మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా సీపీఎం జెండాను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అధికారం కోసం ఆరు గ్యారంటీలు ప్రకటించి.. ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లను కెటాయించాలని, ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించాలని, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని, నివాస ప్రాంత, మహిళలు, నిరుద్యోగ, సామాజిక సమస్యలపై పోరాటాలు చేయాలని మహా సభలో తీర్మానించారు.

నిలోఫర్‌లో కిడ్నాప్ కథ సుఖాంతం..

- నిందితుల అరెస్టు..
- పసి కందును తల్లికి అప్పగించిన పోలీసులు

కిడ్నాప్‌కు గురైన పసికందును తల్లి హసీనా బేగంకు అందజేస్తున్న ఏసీపీ సంజయ్ కుమార్, ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు

సుల్తాన్‌బజార్, నవంబర్ 24: నీలోఫర్ దవాఖానలో నెల రోజుల పసికందు కిడ్నాప్ కథ సుఖాంతమైంది. ఘటన జరిగిన 24 గంటల్లోపు నిందితులను గుర్తించి నెల రోజుల పసికందును తల్లి చెంతకు చేర్చారు. ఆదివారం నాంపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సైఫాబాద్ ఏసీపీ సంజయ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడుతో కలిసి వివరాలను వెల్లడించారు. గత నెల 25న జహీరాబాద్ ఏరియా దవాఖానలో హసీనా బేగం మగబిడ్డను జన్మనిచ్చింది. పుట్టిన బిడ్డకు కామెర్లు ఉండటంతో వైద్య చికిత్స నిమిత్తం గత నెల 29న నిలోఫర్ దవాఖానలో చేర్పించారు. వైద్య చికిత్స అనంతరం ఈ నెల 23న వైద్యులు పసి కందును డిశ్చార్జి చేశారు. అదే సమయంలో ఏపీ, అనంతపురానికి చెందిన షాహీన్ బేగం, అబ్దుల్లా అలియాస్ వెంకటేశ్, రేష్మా అలియాస్ రేణుకలు మగబిడ్డను అపహరించాలని పథకం పన్ని నిలోఫర్‌కు వచ్చారు. వెంకటేశ్ దవాఖాన బయట ఉండగా, షాహీన్ బేగం నల్ల బుర్ఖా ధరించి డిశ్చార్జి కాగితాలపై సంతకాలు చేస్తున్న హసీనాబేగంను దారి మళ్లించి ఆమె వద్ద ఉన్న నెల రోజుల పసికందును అపహరించి ఆటోలో తీసుకెళ్లారు. బాలుడి తల్లి హసీనాబేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాంపల్లి పోలీసులు తక్షణమే 5 బృందాలను రంగంలోకి దింపారు. మాసబ్ ట్యాంక్ వరకు సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి.. ఎన్‌హెచ్ 44 హైవేపై కర్నూలుకు వెళ్తున్నట్లు గుర్తించి.. డీసీపీ అక్షంక్ష్ యాదవ్ గద్వాల ఎస్‌పీకి సమాచారం అందించారు. అతను గద్వాల పీఎస్, కర్నూలు హైవేపై ఉన్న మనపాడు, ఉండవల్లి స్థానిక పోలీస్ స్టేషన్‌లను అప్రమత్తం చేశారు. ఉండవల్లి ఎస్ఐ చంద్రకాంత్ పుల్లూరు టోల్ ప్లాజా వద్ద మారుతీ ఓమ్నీ (ఏపీ 28 ఏవీ 0785)ను ఆపి తనిఖీ చేయగా నిందితులతో పాటు మగ శిశువు ఉన్నట్టు గుర్తించారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని నాంపల్లి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే నాంపల్లి పోలీసులు ఉండవల్లి పీఎస్‌కు వెళ్లి మగ శిశువును తీసుకువచ్చి తల్లి హసీనా బేగంకు ఆదివారం ఏసీపీ సంజయ్ కుమార్ చేతుల మీదుగా అప్పగించారు. కేసును ఛేదించిన నాంపల్లి ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడును, బృందాన్ని డీసీపీ ,ఏసీపీ లు అభినందించారు.

ఆర్చరీలో రాణించిన జువైనల్ బాలుడు

ఆర్చరీ సీనియర్ విభాగం పోటీలో ప్రథమ స్థానంలో నిలిచిన రుబేన్, క్రీడాకారులు

సైదాబాద్, నబంబర్ 24 : ఆర్చరీ హైదరాబాద్ జిల్లా స్థాయి సీనియర్ ఛాంపియన్ షిప్ విభాగంలో సైదాబాద్ జువైనల్ హోం (బాలుర సదనం)కు చెందిన బాలుడు రుబేన్ ప్రథమ స్థానంలో నిలిచినట్లు జువైనల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మిర్జా అలీ బేగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం నగరంలో జరిగిన ఆర్చరీ జిల్లా స్థాయి సీనియర్ ఛాంపియన్ షిప్ విభాగంలో 180 పాయింట్లకు, 157 పాయింట్లు సాధించి మొదటి స్థానంలో నిలిచాడని, డిసెంబర్ 1న కొల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి సీనియర్ ఆర్చరీ పోటీలకు ఎంపికయ్యాడని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాలకు చెందిన ఆర్చరీ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారని, అందులో హైదరాబాద్ జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో రుబేన్ నిలిచాడని తెలిపారు.

మద్యంతాగి 193 మంది పట్టుబడ్డారు..

సిటీబ్యూరో, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ): డ్రంక్ అండ్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు శనివారం రాత్రి నిర్వహించిన వాహనాల తనిఖీల్లో మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ 193మంది వాహనదారులు పట్టుపడ్డారు. వీరిలో ద్విచక్రవాహనదారులు 160మంది, మూడు చక్రాల వాహనదారులు ఆరుగురు, నాలుగు చక్రాల వాహనదారులు 27మంది ఉన్నారు. పట్టుబడిన వారిలో 19మందికి రక్త పరీక్షల్లో బీఏసీ రేంజ్ 200ఎంజీ/100 ఎంఎల్, 550ఎంజీ/100ఎంఎల్‌గా ఉన్నటు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. పట్టుబడిన 193మంది వాహనదారులను న్యాయస్థానంలో హాజరుపరిచి, వారి వాహనాలను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

కళకే వన్నెతెచ్చిన చుక్కా సత్తయ్య

సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి

ముషీరాబాద్, నవంబర్ 24: చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా ఆదివారం ఒగ్గు కథా కళాకారుడు చుక్కా సత్తయ్య సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో శాసన మండలి బీఆర్ఎస్ పక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ముఖ్య అతిథిగా పాల్గొని చుక్కా సత్తయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీరప్పకథను ఒగ్గుకళలో విలీనం చేసి కళకే వన్నే తెచ్చారని కొనియాడారు. జనగాం కేంద్రంగా జ్యోతిర్మయి లలిత కళా సమితి స్థాపించి ఎందరో కళాకారులను తయారు చేశారని అన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రచయిత శైలజా మిత్ర, వీఎస్ఆర్ మూర్తి, వడ్లగుండ వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

సీఏపీఎఫ్ వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలి

చిక్కడపల్లి, నవంబర్ 24 : తెలంగాణ రాష్ట్రంలో సీఏపీఎఫ్ వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని తెలంగాణ మాజీ కేంద్ర సాయుధ పోలీస్ బలగాల సిబ్బంది సంక్షేమ సంఘం (సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్‌బీ, అస్సాం రైఫిల్స్) అధ్యక్షుడు శ్యామ్‌సుందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం ప్రథమ వార్షికోత్సవాన్ని ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. శ్యామ్ సుందర్ రెడ్డి మాట్లాడుతూ .. 2012లో అప్పటి కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన ఎంఓ నంబర్ 2711/ 100 / 2012ను రాష్ట్రంలోనూ అమలు చేయాలన్నారు. ఓల్డ్ పింఛన్ విధానాన్ని అమలు చేయాలని అన్నారు. తెలంగాణ వ్యాప్తంగా డిఫెన్స్ పోర్సెస్‌కు ఇస్తున్న ఇంటి పన్ను రద్దును సీఏపీఎఫ్ సభ్యులకు వర్తింపచేయాలని కోరారు. సంఘం ప్రధాన కార్యదర్శి రాజు, కోశాధికారి వెంకట్ రెడ్డి, సలహాదారులు ఎస్.ఎన్.రెడ్డి, భగవంతు, రామకృష్ణ, భారతి, ప్రేమారెడ్డి పాల్గొన్నారు.

26న వికలాంగుల భక్తులతో తిరుమలకు..

'నడు నడు వెంకన్న కడకు' పేరుతో ఈనెల 26న 399మంది వికలాంగుల భక్తులతో శ్రీవారి ఉచిత దర్శనానికి బయలుదేరనున్నట్లు శ్రీ అష్టోత్తర శత చుక్కల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ వేణుకుమార్ చుక్కల తెలిపారు. ఆదివారం ట్రస్టు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ట్రస్టుకు అంకితభావంతో సేవ చేస్తున్న 60మంది వాలంటీర్లకు తిరుమల యాత్రపై సలహాలు, సూచనలు అందజేశారు. ఈనెల 26న సికింద్రాబాద్‌లో బయలుదేరి.. 27న సాయంత్రం తిరుచానూరు అమ్మవారిని దర్శించుకుని, 28న తిరుమల వెంకన్న స్వామిని దర్శించుకోనున్నట్లు తెలిపారు.

– నేరేడ్‌మెట్, నవంబర్ 24

అవినీతి, కుంభకోణాలపై అదానీని అరెస్ట్ చేయాలి

సీపీఐ ఆధ్వర్యంలో ఈసీఐఎల్ చౌరస్తావద్ద ధర్నా

కాప్రా, నవంబర్ 24 : గౌతమ్ అదానీ, అతని సహచరులపై అమెరికన్ కోర్టులో 250 మిలియన్ డాలర్ల (రూ.2500కోట్లు)లంచం, విద్యుత్ అవినీతి, కుంభకోణాలపై విచారణ జరిపించాలని, భారతదేశ ప్రతిష్టను దెబ్బతీసిన అతడిని అరెస్టు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీఎస్ బోస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఐ ఉప్పల్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఈసీఐఎల్‌లోని అంబేద్కర్ కూడలి వద్ద నిరసన, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వీఎస్‌బోస్ మాట్లాడుతూ.. అదానీ గ్రూప్‌పై తీవ్రమైన నేరారోపణలు ఉన్నాయని, అదానీ గ్రూప్ మురికి ముఖం ప్రజలకు తెలిసిందేనని అన్నారు. మోడీ అధికారం చేపట్టాక అదానీ సంపద అనేక రెట్లు పెరిగిందని అన్నారు. అదానీ గ్రూపుకు ఇచ్చిన కాంట్రాక్టులు, ప్రాజెక్టులన్నీ వెనక్కు తీసుకోవాలని, తక్షణమే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయకార్యదర్శి జి.దామోదర్‌రెడ్డి, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర, సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు శంకర్ రావు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సత్యప్రసాద్, సీపీఐ ఉప్పల్ నియోజకవర్గం నేతలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

బీఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ ఇన్‌చార్జి కార్తీక్ రెడ్డి



జహీరుద్దీన్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి కార్తీక్ రెడ్డి ,తదితరులు

వ్యవసాయ యూనివర్సిటీ, నవంబర్ 24 : సులేమాన్‌నగర్ డివిజన్ అభివృద్ధి బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, రాజేంద్రనగర్ ఇన్‌చార్జి కార్తీక్ రెడ్డి అన్నారు. కొందరు స్వార్థపరులు పార్టీ వీడినంత మాత్రాన కార్యకర్తలు దిగులు చెందవద్దని, వా రికి అండగా తాము ఉంటామని ధైర్యం చెప్పా రు. ఆదివారం నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచి రెడ్డి కిషన్‌రెడ్డి ఆదేశానుసారం సులేమాన్ నగర్ బీఆర్ఎస్ నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమితులైన జహీరుద్దీన్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ.. సులేమాన్ నగర్ డివిజన్‌లో మాజీ సీఎం కేసీఆర్ ఆధ్వర్యం లో తాగునీరు, విద్యుత్, సీసీరోడ్లు, షాదీ ముబారక్, తదితర సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. మీకు అండగా పార్టీ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి , ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఉన్నారన్నారు. కార్యకర్తలు, ప్రజలు బీఆర్ఎస్ పక్షాన ఉన్నారని గుర్తుచేశారు. పార్టీ బలోపేతానికి మనమంతా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అబ్దుల్ మఖీబ్ చందా, పోరెడ్డి ధర్మారెడ్డి, అబ్దుల్ రెహమాన్, ఎండీ సలీమ్, కలీల్, తదితరులు ఉన్నారు.

రామలింగేశ్వరుడికి లక్ష రుద్రాక్షలు

కేపీహెచ్‌బీ కాలనీ 6వ ఫేజ్‌లోని ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తికమాసం సందర్భంగా స్వామివారికి లక్ష రుద్రాక్షలతో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజే శారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

- కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 24

షాపింగ్‌కు వెళ్తుండగా ఢీకొట్టిన వాహనం

భార్య మృతి , భర్తకు గాయాలు

జీడిమెట్ల, నవంబర్ 24 : ద్విచక్ర వాహనాన్ని ఐచర్ వాహనం ఢీ కొట్టడంతో భార్య మృతి చెందగా, భర్తకు గాయాలయ్యాయి. ఈ సంఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. ఎస్ఐ నాయుడు తెలిపిన వివరాల ప్రకారం..రాజీవ్‌గాంధీ నగర్‌లో నివాసం ఉండే నాగరాజు, సిప్రారాణి త్రిపాఠి (28) భార్యాభర్తలు. వీరికి సంవత్సరం క్రితం వివాహం జరిగింది. శనివారం రాత్రి భార్యా భర్తలిద్దరూ షాపింగ్ కోసం యాక్టీవాపై భుజంగా పైపులైన్ రోడ్డు ద్వారా సుచిత్ర వైపు వెళ్తున్నారు. రంగా,భుజంగా సినిమా థియేటర్ దాటగానే వెనక నుంచి వచ్చిన ఐచర్ (టీఎస్ 08 యూ ఎల్ 0528) వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో భర్త ఎడమ వైపునకు పడగా భార్య సిప్రారాణి కుడి వైపునకు పడి తలపై నుంచి వెనక టైరు వెళ్లగా అక్కడికి అక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ నాయుడు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. డ్రైవర్ రాజుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ట్రాక్టర్ కింద పడి డ్రైవర్..

మేడ్చల్, నవంబరు 24 : ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మునీరాబాద్ గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మెదక్ జిల్లాకు చెందిన గావులపల్లి దేవేందర్(50) ట్రాక్టర్ డ్రైవర్. ఆదివారం ట్రాక్టర్‌పై మునీరాబాద్ గ్రామానికి వెళ్లి.. రింగురోడ్డు సర్వీస్ రోడ్డు పక్కన నిలిపాడు. తెలిసిన మరో ట్రాక్టర్ డ్రైవర్ .. ట్రాక్టర్ ఫిల్టర్‌ను శుభ్రం చేస్తుండగా దేవేందర్ ఆ ట్రాక్టర్ వద్దకు వెళ్లాడు. ఇంజిన్ ముందు చక్రానికి, వెనక చక్రానికి మధ్యలో నిల్చొని ట్రాక్టర్‌ను తాళం చెవితో స్టార్ట్ చేశాడు. అయితే ట్రాక్టర్‌కు గేర్‌వేసి ఉండటంతో ఒక్కసారిగా వాహనం ముందుకు కదలడంతో కింద పడిపోయాడు. అతడిపై నుంచి చక్రాలు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

క్రేన్ ఢీకొని వ్యక్తి ..

భాస్కర్(ఫైల్)

చర్లపల్లి, నవంబర్ 24 : అతివేగంగా దూసుకువచ్చిన క్రేన్ ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. చర్లపల్లిలో నివాసముండే దొంతుకుర్తి భాస్కర్(42) ఆదివారం మధ్యాహ్నం షాపుకు వెళ్లి.. తిరిగి సైకిల్‌పై ఇంటికి వెళ్తున్నాడు. పుక్కట్‌నగర్ ప్రభుత్వ పాఠశాల వద్దకు రాగానే అతివేగంగా దూసుకువచ్చిన క్రేన్(టీఎస్08జేపీ 2967) భాస్కర్‌ను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వేట్రాక్‌పై పడి ట్రాలీ డ్రైవర్ ..

మారేడ్‌పల్లి, నవంబర్ 24: ట్రాలీ ప్రమాదవశాత్తు ప్లాట్ ఫారంపై నుంచి రైల్వే ట్రాక్‌పై పడి.. వాహన డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం..సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారం నం. 7లో ఆదివారం తెల్లవారు జామున కుర్మ రాములు (54) అనే వ్యక్తి బ్యాటరీ వాహనం నడుపుకుంటూ వెళ్తుండగా ప్రమాదవశాత్తు ప్లాట్ ఫారం నుంచి జారి రైల్వేట్రాక్‌పై పడడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని..పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మరో కార్మికుడు ..

దుండిగల్, నవంబర్ 24: జీడిమెట్ల పారిశ్రామికవాడలోని ఆరోర్ ఫార్మాస్యూటికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో ఇటీవల రియాక్టర్ పేలడంతో తీవ్రంగా గాయపడి వైద్యశాలలో చికిత్స పొందుతున్న ముగ్గురు కార్మికుల్లో ఓ కార్మికుడు శనివారం రాత్రి మృతి చెందారు. సూరారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...జీడిమెట్ల పారిశ్రామిక వాడ, ఫేజ్-4లోని ఆరోర్ ఫార్మాస్యూటికల్స్ పరిశ్రమలో సూరారం కాలనీకి చెందిన అనిల్(41), బలరాంతో పాటు చింతల్‌లో నివాసముంటున్న శ్రీనివాస్‌రెడ్డిలు క్యాజువల్ కార్మికులుగా పనిచేస్తుండగా, గోపిచంద్ కెమిస్టుగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ఈనెల 20న ఉదయం అనిల్, శ్రీనివాస్‌రెడ్డి, బలరాంలు బాయిలర్‌ను శుభ్రం చేస్తుండగా రియాక్టర్ పేలిన విషయం విధితమే. ఈ ప్రమాదంలో అనిల్ అక్కడికక్కడే దుర్మరణం చెందగా, బలరాం,శ్రీనివాస్‌రెడ్డి, గోపిచంద్‌లు సైతం తీవ్రంగా గాయపడ్డాడు. పరిశ్రమ యాజమాన్యం క్షతగాత్రులను నగరంలోని యశోద వైద్యశాలకు తరలించింది. నాటి నుంచి చికిత్స పొందుతున్న బలరాం(51) శనివారం రాత్రి తుదిశ్వాస విడిచారు. బలరాంకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

విశ్రాంత ఉద్యోగి ఆత్మహత్య

నర్సింహ (ఫైల్)

ఎల్బీనగర్, నవంబర్ 24: ఓ విశ్రాంత ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. కొత్తపేట, మోహన్‌నగర్‌కు చెందిన నాలికల నర్సింహా (76) మిధానిలో స్టోర్‌కీపర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. అయనకు ముగ్గురు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. ప్రస్తుతం మోహన్‌నగర్‌లోని పెద్ద కుమారుడు నాలికల రాజు వద్ద ఉంటున్నాడు. అయితే.. శనివారం రాత్రి నర్సింహా.. గదిలోని సీలింగ్‌కు లుంగీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం తెల్లవారుజామున కుటుంబ సభ్యులు గమనించి సీలింగ్ నుంచి కిందకుదించి బెడ్‌పై పడుకోబెట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. అయితే నర్సింహా కూతురు కల్పన తన తండ్రి మరణంలో అనుమానాలు ఉన్నాయని, విచారించి చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సుల్తాన్‌బజార్‌లో రూ.6.69 లక్షల నగదు పట్టివేత

సుల్తాన్‌బజార్, నవంబర్ 24 : సుల్తాన్‌బజార్‌లోని రాయల్ ప్లాజా భవనం వద్ద రూ.6.69 లక్షల హవాల నగదును ఆదివారం సుల్తాన్‌బజార్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సుల్తాన్‌బజార్ డివిజన్ ఏసీపీ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. సుల్తాన్‌బజార్‌లోని రాయల్ ప్లాజా భవనం వద్ద నుంచి హవాల నగదును తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్ఐ నరేశ్.. పీసీలు దీపక్, మచ్చగిరి,నవీన్‌రెడ్డిలతో కలిసి నిఘా ఉంచారు. అదే సమయంలో నాంపల్లి రిసాలాఅబ్దుల్లా ప్రాంతానికి చెందిన ప్లైవుడ్ మార్కెటింగ్ మహ్మద్ సంజయ్ కుమార్ మహంకారి, సుల్తాన్‌బజార్ ఓల్డ్ పోలీస్ క్వార్టర్స్ ప్రాంతానికి చెందిన బేమర్ బాయి దేవర్‌జీ రాజ్‌పుత్, సుల్తాన్‌బజార్‌కు చెందిన అర్జున్ బాయి చందాజీ రాజ్‌పుత్‌లు ఒక దగ్గర గుమిగూడారు. వారివద్ద ఉన్న బ్లాక్ కలర్ బ్యాగు అనుమానాస్పదంగా కనిపించగా వెంటనే అక్కడికి వెళ్లి తనిఖీ చేయగా.. రూ. 6.69 లక్షల నగదు లభ్యమైంది. ఈ విషయమై వారిని విచారించగా ఎటువంటి సమాధానం లేకపోవడంతో అదుపులోకి తీసుకొని నగదును, మూడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న నగదును అయకార్ భవన్ ఆదాయపు పన్ను డైరెక్టర్‌కు అప్పగించినట్లు ఏసీపీ శంకర్ వివరిం చారు.

డ్రగ్స్ సరఫరా .. ఇద్దరు అరెస్టు

కీసర, నవంబర్ 24: డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్న ముఠాను మల్కాజిగిరి ఎస్‌వోటీ పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం..రాజస్థాన్ ప్రాంతానికి చెందిన నలుగురు డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్‌వోటీ పోలీసులు అహ్మద్‌గూడ, ఠాగూర్ పారమ్‌దామ్ కాలనీలో దాడిచేసి శాతన్‌రాం, జగదీశ్‌లను పట్టుకుని, వారి నుంచి డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు కమలేశ్, దినేశ్‌లు పరారయ్యారు. వీరంతా రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన వారు. వీరివద్ద నుంచి 10 గ్రాముల హెరాయిన్, బైక్, 4 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొన్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారి అదృశ్యం

రాజేంద్రప్రసాద్

హయత్‌నగర్, నవంబర్ 24 : రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, నెల్లూరుకు చెందిన కామిరెడ్డి రాజేంద్రప్రసాద్(38) మణికొండ, నెక్నాంపూర్‌లో ఎన్ఎక్స్‌టీ ఇన్ఫ్రా రియల్ ఎస్టేట్ కంపెనీ ద్వారా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. ఈనెల 21న రాత్రి 9.30 గంటలకు కంపెనీలో టెలికాలర్‌గా పనిచేసే స్వప్నకు రాజేంద్రప్రసాద్ ఫోన్‌చేసి తన కారు, తాళాలు, రెండు ఫోన్లు కారులోని ఉంచి హయత్‌నగర్‌లో పార్కింగ్ చేసి వెళ్తున్నాను చెప్పి ఫోన్ పెట్టేశాడు. ఆందోళనకు గురైన కంపెనీ సభ్యులు రాజేంద్రప్రసాద్ గురించి చుట్టుపక్కల ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద విచారించగా ఆచూకీ దొరకలేదు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PEST CONTROL

★చెదలు, బొద్దింకలు నివారణ: న్యూ కన్‌స్ట్రక్షన్ ట్రీట్‌మెంట్ 10 సంవత్సరాల గ్యారెంటీ మరియు శానిటైజర్ స్ప్రే కొరకు సంప్ర: 9392468282, 8333030227.
NT-335868

GOLD FINANCE